క్లుప్తంగా

3న సామూహిక అక్షరాభ్యాసం

శ్రీకాళహస్తి: పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో సోమవారం వసంత పంచమిని పురస్కరించుకుని సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం వినాయక పూజతో కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. బాసర జ్ఞానసరస్వతి ఆలయంలో అర్చన చేసిన కుంకుమలతో సామూహికంగా సరస్వతి అష్టోత్తర పూజలు చేసి పలక, బలపం విద్యార్థులకు అందజేస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్సీ వర్గీకరణే లక్ష్యం


మాదనపాలెం అరుంధతివాడలో ఎమ్మార్పీఎస్ నాయకులు

వరదయ్యపాళెం: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ లక్ష్య సాధనకు ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే లక్షల డప్పులు.. వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ సుధాకర్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పలు అరుంధతివాడల్లో వారు కార్యక్రమాన్ని నిర్వహించి వర్గీకరణ ఆవశ్యకతను వివరించారు. నియోజకవర్గం నుంచి వందలాదిగా తరలివెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాగిపట్టు రాఘవయ్య, నాయకులు భాస్కర్ మాదిగ, వెంకటరమణ, బాలకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో వర్గ విభేదాలు

శ్రీకాళహస్తి: జనసేనలో వర్గ విభేదాలు బయటపడ్డాయి. శ్రీకాళహస్తి పురపాలకసంఘ కార్యాలయంలో శనివారం జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సమావేశానికి కొందరు జనసేన నాయకులు తమకు ఆహ్వానం అందలేదంటూ విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటులో తమ పాత్ర ఉందంటూ వారు పురపాలక సంఘ కార్యాలయం వద్ద మాట్లాడటం సర్వత్రా విమర్శలకు దారి తీసింది. అయితే ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి జనసేనలో ఓ వర్గాన్ని చేరదీస్తున్నారని, వారికి మాత్రమే సమాచారం ఇస్తున్నారని మరో వర్గాన్ని పట్టించుకోవడంలేదని ఇది సరైంది కాదని తాము కూడా పనిచేశామంటూ వారు వాపోతున్నారు.

వేడుకగా స్పోర్ట్స్ డే


బహుమతులతో విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని జయరామరావువీధిలోని శ్రీ చైతన్య పాఠశాలలో స్పోర్ట్స్‌డే శనివారం వేడుకగా నిర్వహించారు. ప్రీ ప్రైమరీ విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సురేష్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ సుధాకర్, డీన్ శంకర్, ఏవో శివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం తాగితే చర్యలు


మద్యపానంతో నష్టాలను వివరిస్తున్న ఎస్‌ఐ వెంకటేష్

నాగలాపురం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని పిచ్చాటూరు ఎస్‌ఐ వెంకటేష్ అన్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే నేరాలు ఎక్కువగా జరిగే అవకాశాలున్నాయని శనివారం మండలంలో మందుబాబులు ఎక్కువగా మద్యం తాగే ప్రదేశాలను గుర్తించారు. అక్కడ ఉన్న ఖాళీ మందు బాటిళ్లు, ప్లాస్టిక్ కప్పులను పంచాయతీ పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. మద్యం తాగడంతో కలిగే నష్టాలను యువకులకు వివరించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగుతూ పట్టుబడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

రాయిని ఢీకొట్టిన కారు

నాగలాపురం: మండలంలోని బయటకొడియంబేడు గ్రామం వద్ద పుత్తూరు–ఊత్తుకోట హైవేపై కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. తమిళనాడుకు చెందిన వారు తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి దర్శనానంతరం చెన్నైకి తిరుగు ప్రయాణంలో వెళ్తూ బయటకొడియంబేడు గ్రామం వద్ద రోడ్డుకు అడ్డంగా వచ్చిన ఆవును తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న రాయిని ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ రోడ్డు ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

చెరువు కట్ట కబ్జా

శ్రీకాళహస్తి: నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలం లింగమనాయుడుపల్లి పంచాయతీ పరిధిలోని నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న చెరువుకట్టను ఓ అధికార నేత కబ్జా చేశాడు. దీనిపై గ్రామస్తులు అతనిని ప్రశ్నించారు. తహసీల్దారు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఆక్రమించుకున్న స్థలంలో కట్టుకున్న షెడ్డుకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఫొటో ఫ్లెక్సీని అతికించేశారు. ఇప్పుడు ఏ అధికారి వస్తాడో చూస్తామంటూ ఆ కబ్జాదారులు బహిరంగంగానే చెబుతున్నారు. అందులో భాగంగానే అధికారులు సైతం అటువైపు వెళ్లకపోవడం సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రోడ్డు ధ్వంసం.. జర భద్రం!

రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుపతి వైపు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. పాపానాయుడుపేట సర్కిల్ నుంచి నారాయణ కళాశాల వరకు మరీ అధ్వానంగా తయారైంది. రోడ్డుపై మోకాటి లోతు గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనదారులు తీవ్ర గాయాలపాలవుతున్నారు. శనివారం రాత్రి ఓ కారు గుంతలో పడడంతో ముందు చక్రం పూర్తిగా దెబ్బతింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అగచాట్లు పడాల్సి వచ్చింది.

– రేణిగుంట




పట్టాల పంపిణీ ఎన్నడో?

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదనే సామెత చందాన ఉంది వరదయ్యపాళెం మండలంలో అధికారుల తీరు. పేదల సొంత ఇంటి కల నెరవేర్చాలనే సంకల్పంతో గత ప్రభుత్వం ఇళ్ల పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఆ దిశగా వరదయ్యపాళెం మండల కేంద్రంలో ప్రభుత్వ భూమి లేని కారణంగా ప్రైవేటు రైతుల వద్ద భూములను కొనుగోలు చేసింది. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా అప్పటి ప్రభుత్వం లక్ష్యం నీరుగారింది. మండలంలోని వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ, ఇందిరానగర్ గ్రామ పంచాయతీల పరిధిలో సొంత ఇల్లు లేని నిరుపేద వర్గాలకు చెందిన 450 కుటుంబాలను రెవెన్యూ అధికారులు గుర్తించారు. వారికి ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేసేందుకు గత ప్రభుత్వంలో ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అది సాధ్యం కావడం లేదు. – వరదయ్యపాళెం

- వరదయ్యపాళెంలో 450 మంది లబ్ధిదారులు
- పంపిణీకి ప్రైవేటు స్థలం కొనుగోలు చేసిన గత ప్రభుత్వం
- రైతులకు రూ.2 కోట్ల పరిహారం పంపిణీ పూర్తి
- అయినా పంపిణీకి నోచుకోని ఇళ్ల స్థలాలు

జగనన్నకాలనీ కోసం తలారివెట్టులో ప్రభుత్వం కొనుగోలు చేసిన స్థలం



లేఅవుట్ ముఖచిత్రం

వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూమి లేకపోవడంతో.. మండల కేంద్రానికి సమీపంలోని బుచ్చినాయుడుకండ్రిగ మండల పరిధిలో తలారివెట్టు వద్ద సర్వే నెంబరు 130, 131, 135, 136, 136/2లలో గల 15.31 ఎకరాల ప్రైవేటు రైతుల భూమిని గుర్తించారు. వారి నుండి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వానికి నివేదించడంతో ప్రభుత్వం స్పందించి ఎకరా రూ.12.50 లక్షలకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం ముందుకొచ్చింది. ఆ మేరకు ఏడాదిన్నర క్రితం భూములు కోల్పోయిన సంబంధిత రైతులకు రూ.1.91 కోట్ల పరిహారాన్ని గత ప్రభుత్వం అందజేసి సంబంధిత భూములను అప్పటి ప్రభుత్వం కొనుగోలు చేసింది.

పరిహారం పంపిణీ చేసినా....

ఏడాది క్రితం భూములిచ్చిన రైతులకు పరిహారం అందజేసినప్పటికీ సంబంధిత భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని చకచకా పట్టాలను పంపిణీ చేయాల్సిన రెవెన్యూ అధికారులు ఆ దిశగా అడుగులు వేయలేదు. ముళ్ల చెట్లు తొలగించారే తప్ప లేఅవుట్ పనులు ఎక్కడా జరగలేదు. ప్రధానంగా వీధులు, ప్లాట్ల కేటాయింపులకు సంబంధించి హద్దు రాళ్ల నాటలేదు. అంతేకాక కాలనీలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు.

హౌసింగ్ అధికారుల నిర్లక్ష్యం

మండలంలోనే తలారివెట్టు వద్ద అతిపెద్ద లేఅవుట్ ఏర్పాటవుతున్న ఇప్పటి వరకు రోడ్ల విస్తరణ, మౌలిక వసతుల కల్పన జరగలేదు. ప్రధానంగా ఇళ్ల పట్టాల పంపిణీకి ముందే హౌసింగ్ అధికారులు లేఅవుట్‌ను అన్ని వసతులతో అభివృద్ధి చేయాల్సి ఉంది. అయితే సంబంధిత అధికారులు ఆ దిశగా అడుగులు వేయలేదు. దీనిపై లబ్ధిదారులు సైతం ఆవేదనతో ఉన్నారు. పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని అధికారులే నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి లేఅవుట్ అభివృద్ధితోపాటు త్వరితగతిన ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

అద్దె ఇంట్లో ఇబ్బంది



నా పేరు ఈశ్వరి. ఇందిరానగర్ పంచాయతీలోని పద్మావతిపురంలో అద్దె ఇంట్లో ఉన్నాను. పుట్టుకతో నేను ప్రత్యేక ప్రతిభావంతురాలిని. అంతేకాక నేను ఒంటరి మహిళగా జీవనం సాగిస్తున్నాను. నాకు నెలసరి వచ్చే రూ.4 వేల పింఛన్‌లో రూ.1500 అద్దెకే సరిపోతుంది. మిగిలిన రూ.2500లతో నెలంతా గడవాల్సి ఉంది. తలారివెట్టు వద్ద నాకు ఇంటి స్థలం మంజూరు చేశారని గతంలో గ్రామ వలంటీర్ ద్వారా తెలుసుకున్నాను. నాలుగేళ్లుగా పట్టా నాకు అందలేదు. నాలాంటి వారికి అద్దె ఇల్లు పెనుభారమే.

– ఈశ్వరి, పద్మావతిపురం, ఇందిరానగర్ పంచాయతీ

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..



తలారివెట్టు వద్ద ఏర్పాటుకానున్న పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ లేఅవుట్ స్కెచ్ ప్రక్రియ పూర్తి చేశాం. క్షేత్రస్థాయిలో హద్దు రాళ్లు నాటాల్సి ఉంది. హౌసింగ్ వారు రోడ్ల అభివృద్ధి ప్రక్రియ పూర్తి చేస్తే తక్షణమే హద్దు రాళ్లను ప్లాట్ల వారీగా నాటిస్తాం. నేను తహసీల్దార్‌గా ఇటీవలే మండలంలో బాధ్యతలు స్వీకరించాను. పట్టాల పంపిణీ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనలు పాటిస్తాం. ఇదివరకే అందిన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారులను గుర్తిస్తాం.

– రాజశేఖర్, తహసీల్దార్, వరదయ్యపాళెం

ఉల్లాసంగా నోబ్యాగ్ డే


బొమ్మలు వేసిన విద్యార్థులు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం దిగువసాంబయ్యపాళెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు వివిధ కార్యక్రమాలతో నో బ్యాగ్‌డే నిర్వహించారు. ఉపాధ్యాయుడు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులకు అనేక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవలన్నారు. ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ మోహన్‌రాణి, ఆయా మాధవి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు


వాహనాలు తనిఖీలు చేస్తున్న సీఐ, ఎస్‌ఐ

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని పాపానాయుడుపేట రహదారి యోగానంద కాలేజ్ సమీపంలో శనివారం రూరల్ సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ సుధాకర్ వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలకు ఆర్‌సీ, ఇన్సూరెన్స్, లైసెన్స్ వంటి పత్రాలను పరిశీలించి హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా తనిఖీలు చేపట్టామని అన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

ప్రజాప్రతినిధులను అవమానిస్తారా..?

- అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానం ఏదీ..
- పంచాయతీ తీర్మానం లేకుండానే పనులు
- వాడీవేడిగా మండల సమావేశం


సమావేశంలో సమస్యను వివరిస్తున్న సర్పంచులు


పంచాయతీ కార్యదర్శి రమేష్ దురుసు ప్రవర్తన

రేణిగుంట: ''ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన మేము ఈ ప్రభుత్వంలో అడుగడుగునా అవమానాలకు గురవుతున్నాం. మా గ్రామాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు సర్పంచులు, ఎంపీటీసీలకు కనీస సమాచారం ఇవ్వడంలేదు.. పంచాయతీ తీర్మానం లేకుండానే పనులు చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.. తీరు మార్చుకోవాలని మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు హితవు పలికారు. ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ప్రజాప్రతినిధుల హక్కులను అధికారులు కాలరాస్తున్నారని, ప్రజలకు సేవ చేసేందుకు వచ్చిన ప్రజాప్రతినిధులను అవమానకర రీతిలో వ్యవహరిస్తున్నారని, ఇకనైనా తీరు మార్చుకుని మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గాజులమండ్యం సర్పంచ్ గంగారి రమేష్ మాట్లాడుతూ మండలంలో బఫర్‌జోన్, కాల్వ పోరంబోకు స్థలాలు పేరిట పేదల ఇళ్లను కూల్చేశారని, అయితే గాజులమండ్యం పంచాయతీ నీలిశానిపేటలో కాల్వలోనే ప్రభుత్వ ధనం వృథా చేసి మినీ గోకులం షెడ్డును ఏ నిబంధనల మేరకు నిర్మిస్తున్నారని ప్రశ్నించారు. పంచాయతీ పరిధిలోని నీలిశానిపేటలో రూ.1.94లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ఓ వ్యక్తి తవ్వేసి తన పొలంలో కలుపుకున్నాడని విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ రాజ్ ఏఈ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను మా పంచాయతీకి కేటాయించకుండా చేసి పనులకు ఆటంకం కలిగిస్తున్నారని విప్పమానుపట్టెడ సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి అన్నారు. తండ్లం పంచాయతీలో ఉపాధిహామీ పనుల పరిశీలనకు వస్తే కనీస సమాచారం కూడా ఇవ్వలేదని సర్పంచ్ పాడి సోమలత ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెపండుగకు కేటాయించిన మూడు పనులను పంచాయతీ పరిధిలోని ఒకే గ్రామానికి కేటాయించడంపై ఎంపీటీసీ ఆనందరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. తూకివాకం నక్కలకాలనీలో రైల్వే లైను విస్తరణ కోసం ఇళ్లు కోల్పోయిన వారికి ఇచ్చే పరిహారంలో అక్రమాలు జరిగాయని, విచారించాలని కోరారు.

కార్యదర్శి దురుసు ప్రవర్తన

కరకంబాడి కార్యదర్శి రమేష్ అర్హులైన వారికి ఇంటిపన్నులు ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నారని ఎంపీటీసీ కన్నయ్య చెప్పడంతో కోపోద్రిక్తుడైన కార్యదర్శి రమేష్ ఒక్కసారిగా ప్రజాప్రతినిధులపై విరుచుకుపడ్డాడు. దీంతో ప్రజాప్రతినిధులు ఒక్కసారిగా పచ్చచొక్కా వేసుకుని రాజకీయాలు చేయండంటూ కా ర్యదర్శికి సలహా ఇచ్చారు. దీంతో ఆయన మరింత రెచ్చిపోయి పక్కనే ఉన్న కొత్రమంగళం సర్పంచ్ మల్లం మదన్‌మోహన్‌రెడ్డిపై చేయి చూపుతూ గట్టిగా కేకలు వేస్తూ పైకి దూసుకెళ్లాడు. ఈ పరిణామంతో అవాక్కైన ప్రజాప్రతినిధులు కార్యదర్శి వ్యవహార తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు టి.సంధ్యారాణి, ఎంపీడీవో విష్ణుచిరంజీవి, వైస్ ఎంపీపీ సుజాత, మండల అధికారులు పాల్గొన్నారు.

శ్రీవేదనారాయణుని ఆలయంపై మంచు దుప్పటి


దట్టమైన మంచు మధ్యలో ఆలయం

నాగలాపురం: మండల కేంద్రంలోని టీటీడీకి అనుబంధంగా ఉన్న శ్రీవేద నారాయణ స్వామి ఆలయంలో శనివారం ఉదయం 8.30 గంటలకు దట్టమైన పొగ మంచుతో మూసుకుపోయింది. మంచు కమ్మేయడంతో ఎదురుగా వచ్చే మనుషులు కనబడని పరిస్థితి ఏర్పడింది. మునుపెన్నడూ లేని విధంగా ఈ రోజు ఉదయం చిరుజల్లులను తలపించే విధంగా పొగమంచు కురిసింది. జనం మంచు, చలి తీవ్రతకు అల్లాడిపోయారు. చిన్నపిల్లలు, వృద్ధులు సైతం ఇంటికే పరిమితమయ్యారు.

సీపీఐ ఆధ్వర్యంలో భూ ఆక్రమణ


భూమిలోని చెట్లు, పుట్టలను తొలగిస్తున్న దళితులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామానికి చెందిన దళితులు శనివారం ఇంటి స్థలాల కోసం సీపీఐ ఆధ్వర్యంలో బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని ప్రభుత్వ భూమిలో చెట్లు, పుట్టలను తొలగించి ఆక్రమించారు. ఈ సందర్భంగా సీపీఐ సత్యవేడు నియోజకవర్గం కార్యదర్శి అంబాకం చిన్నిరాజ్ మాట్లాడుతూ బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని కనమనంబేడు గ్రామ రెవెన్యూలోని 252, 253, 254 సర్వే నెంబర్‌లలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని ఇంటి స్థలాలు లేని దళితులు ఆక్రమించుకున్నారని, వారికి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని దళితులు ఇంటి స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. సమస్యను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. దళితులు ఆక్రమించుకున్న భూమికి పట్టాలు ఇవ్వాలన్నారు. సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, సర్పంచ్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట


మీడియాతో మాట్లాడుతున్న మంత్రులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేసి, అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. పట్టణంలోని పురపాలకసంఘం కార్యాలయంలో శనివారం పలు శాఖల అధికారులతో వారు సమీక్ష నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి ట్రాఫిక్ మళ్లింపు, భక్తులకు అవసరమైన పార్కింగ్, రవాణా, తదితర అంశాలపై చర్చించారు. అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి మార్చి 6వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ యేడాది భక్తులకు ఉచితంగా లడ్డు ప్రసాదాన్ని కూడా అందజేస్తామన్నారు. మహిళలకు రవికతో పాటు గాజులు, పసుపు, కుంకుమసొరెగా ఇస్తామన్నారు. క్యూలలో వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు, చిన్నారులకు పాలు పంపిణీ చేస్తామన్నారు. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి 24మంది సభ్యులతో సేవాసమితి నియామకాన్ని త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఆర్డీవో భానుప్రకాష్, ఈవో బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఆర్వో కార్యాలయం ప్రారంభం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నాలుగో గేటు వద్ద నూతనంగా నిర్మించిన సీఆర్వో, పీఆర్వో కార్యాలయాలను రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి శనివారం ప్రారంభించారు. ముందుగా మంత్రులకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం లాంఛనంగా స్వామి అమ్మవార్ల చిత్రపటానికి పూజలు చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

దారి తవ్వేసి వదిలేశారు!


ఏర్పేడు మండలం జంగాలపల్లిలో తవ్వేసిన రోడ్డు

రేణిగుంట (ఏర్పేడు): ఏర్పేడు మండలం జంగాలపల్లిలో ఎస్టీ కాలనీకి వెళ్లే దారిని టీడీపీ నాయకుడొకరు తవ్వేసి ఎలాంటి మరమ్మతులు చేపట్టకుండా వదిలేయడంతో అటువైపు రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జంగాలపల్లి ఎస్టీ కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను సర్పంచ్ నారాయణ ఏర్పాటు చేశారు. అయితే లోపల సమస్య ఏర్పడి నీళ్లు ఎటూ వెళ్లకపోవడంతో నెల కిందట గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు రోడ్డును తవ్వేశారు. అయితే అక్కడ ఎ లాంటి మరమ్మతులూ చేపట్టకపోవడంతో తవ్వేసిన రోడ్డు దాటలేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి. త్వరితగతిన రోడ్డును పూడ్చి బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మహాసభలను జయప్రదం చేయండి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలం గురవరాజు పల్లి పంచాయతీ సీడబ్ల్యూసీ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆంజనేయస్వామి గుడి వద్ద సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని గోడ పత్రికలను విడుదల చేశారు. రేణిగుంట, ఏర్పేడు మండలాల సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో సీపీఐ(ఎం) పార్టీ 27వ రాష్ట్ర మహాసభల బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం సాధనకు జరిగే బహిరంగ సభలో కార్మికులు, కర్షకులు ప్రజలు, ప్రజాతంత్ర వాదులు, మేధావులు పాల్గొనాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఈశ్వరమ్మ, సీడబ్ల్యూసీ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు శివ, విజయ్, నాగూర్ బాషా తదితరులు పాల్గొన్నారు.